# జాతీయ పెన్షన్ పథకం - పెన్షన్ నిధి నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికారసంస్థ బిల్లు

**- పి. పాండురంగవరప్రసాదరావు**

ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటురంగంలో పనిచేసే కార్మికులు, పదవీ విరమణ చేసిన తరువాత వారికి జీవనోపాధిని కల్పించవలసిన బాధ్యత సమాజంపై ఉన్నది. ఆ సామాజిక భద్రతలో భాగంగా భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వోద్యోగులకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాయి. ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఆ ఉద్యోగి చివరి నెలలో పొందుతున్న మూలవేతనం + కరువు భత్యంలో 50% పెన్షన్‌గా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్నది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే విధంగా పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఉద్యోగి మరణిస్తే అతని కుటుంబానికి కూడా పెన్షన్ చెల్లించే చట్టబద్ధవిధానం అమలులో ఉన్నది. పెన్షన్‌దారులకు కూడా వేతన సవరణలను వర్తింపచేసి పదవీవిరమణ చేసిన ఉద్యోగులు వృద్ధాప్యంలో ఎటువంటి చీకూ, చింతా లేకుండా ప్రశాంత జీవనం గడిపే విధంగా భారతదేశంలో పెన్షన్‌చట్టాలు అమలులో ఉన్నాయి. ఈ పెన్షన్‌పొందటానికి ఉద్యోగి తను ఉద్యోగం చేస్తున్న కాలంలో ఒక్కరూపాయికూడా తనజీతంనుండి చెల్లించ నవసరంలేదు. ఈ పెన్షన్ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తూ వచ్చాయి. అంతేకాక పెన్షన్ కమ్యుటేషన్ సౌకర్యాన్ని కూడా కల్పించాయి. దీనిని పెన్షన్ రంగంలో Defined Benefit System అంటారు.

భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన తరువాత, ప్రపంచబ్యాంకు నుండి, అంతర్జాతీయ సమాజం నుండి బహుళజాతి సంస్థల నుండీ, భారత పారిశ్రామిక వాణిజ్యవర్గాల నుండి, ప్రభుత్వం పెన్షన్ ఖర్చు తగ్గించుకోవాలనే డిమాండ్ ముందుకు వచ్చింది. పలుకుబడి కలిగిన ఆ వర్గాలు భారతదేశం ఆర్థికంగా నిలుదొక్కు కోవాలంటే కరెంట్ ఖాతా లోటు తగ్గించుకోవాలి. కనుక పెన్షన్‌రంగంలో సంస్కరణలు చేపట్టవలసిందేనని భారత ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ వచ్చాయి. భారతదేశంలో ఉద్యోగవర్గానికి మాత్రమే పెన్షన్ సదుపాయం ఉన్నది. మిగిలిన ప్రజలకు కూడా వృద్ధాప్యంలో భద్రత కల్పించాల్సిన అవసరం ఉందంటూ, దానికొరకు 2000 సంవత్సర ఎస్.ఎ.ఎం ఆధ్వర్యంలో వృద్ధాప్య సాంఘిక ఆర్థిక భద్రత నివేదిక (Old Age Social and Income Report) ఒకటి రూపొందించారు. అసంఘటిత రంగానికి పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆ నివేదికలో ప్రభుత్వానికి సూచించారు. ఏటా లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీల రూపంలోను, రకరకాల సబ్సిడీల



www.apfrvizag.yolasite.com

రూపంలోను పొందుతున్న భారతపెట్టుబడిదారీ వర్గాలు, ఉద్యోగులకు జీవన భద్రత కల్పించే పెన్షన్‌కు అయ్యే ఖర్చును తగ్గించుకోవాలని పట్టుబడుతూ వచ్చాయి. పెట్టుబడి దారీ వర్గాల ప్రయోజనాలకే పెద్దపీట వేసే భారత పాలకులు (దశాబ్దాలుగా అమలులో ఉన్న పెన్షన్ విధానం (Defined Benefit System) స్థానంలో ఉద్యోగులు తమజీతం నుండి ఇచ్చే మొత్తంతో ఏర్పడే నిధి ద్వారా పెన్షన్ చెల్లించే విధానం కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వ నోట్ F.No.5/7/2003 - ECB & PR తేది: 10-10-2003 ద్వారా ఈ విధానాన్ని అమలులోనికి తీసుకువచ్చారు. 1-1-2004 నుండి అమలులోనికి వచ్చిన ఈ విధానానికి నూతన పెన్షన్ పథకం (New Pension Scheme) అని పేరుపెట్టారు. ఈ విధానాన్ని ఆర్థిక పరిభాషలో Defined Contribution system అంటారు. భారత ప్రభుత్వం ఈ విధంగా Defined Benefit System నుండి Defined Contribution System కు మారడం ద్వారా దేశంలో ఉద్యోగులు పదవీవిరమణ తరువాత పొందుతున్న సామాజిక భద్రతను తొలగించింది. ఈ విధానం 1-1-2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు మాత్రమే వర్తింస్తుందన్నప్పటికీ అంతకు ముందు నియమితులైనవారికి వర్తింపచేస్తూ తరువాత కాలంలో సవరణలు చెయ్యదన్న గ్యారంటీ ఏమిలేదు. ప్రజాప్రయోజనాలకు సంబంధించి నిధులను మంజూరు చేయడానికి మీనమేషాలను లెక్కిస్తూ, దేశంలో సబ్సిడీలు అధికమై పోతున్నాయని గగ్గోలుపెట్టే పాలకులు, ప్రజలకు ఆహారభద్రతను కల్పించటానికి చట్టసవరణ చేయాలని, పార్లమెంటులోని అన్ని పక్షాలు అంగీకరించాలని సుద్దులు చెప్పే పాలకులు ఎటువంటి చట్టసవరణ లేకుండానే కేంద్ర క్యాబినెట్ తీర్మానంలో ఈ నూతన పెన్షన్ విధానాన్ని అమలుచేశాయి. ఈ విధానాన్ని అమలు చేయుటకు ఉద్దేశించిన పెన్షన్ నిధి నియంత్రణ అభివృద్ధి ప్రాధికారసంస్థ (Pension Fund Regulatory and Development) బిల్లు ఇంకా పార్లమెంటులో ఆమోదం పొందలేదు. 1-1-2004 నుండి అమలులోనికి తెచ్చిన ఈ విధానానికి చట్టబద్ధత చేకూర్చేటందుకు 2005 మార్చిలో పార్లమెంటులో పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లు ప్రవేశపెట్టారు. కాని ఆ లోక్‌సభ కాలావధి ముగిసేలోగా అది ఆమోదం పొందలేదు. ఆ తరుణంలో మరల 2011లో ఈ బిల్లు ప్రవేశపెట్టారు. ఇంకా ఆమోదం పొందలేదు. ఈ లోక్‌సభ గడువు ముగిసేలోగా దానిని ఆమోదింప చేయటానికి భారత ప్రభుత్వం పట్టుదలతో ఉన్నది. ఇంకా చట్టబద్ధంకాని ఒక విధానాన్ని, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాన్ని గత పదేళ్ళుగా భారత ప్రభుత్వం అమలు చేస్తోంది. 16 రాష్ట్రాలు ఇప్పటికే పాత పెన్షన్ విధానం నుండి నూతన పెన్షన్ విధానానికి మారాయి.

**ప్రతిపాదిత పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లులోని ముఖ్యాంశాలు :**

ఈ బిల్లు ద్వారా పెన్షన్ నిధి నియంత్రణ మరియు అభివృద్ధి ప్రాధికార సంస్థ

(PFRDA) కు చట్టబద్ధత ఏర్పడుతుంది. బిల్లు ఆమోదం పొందిన నాటినుండి ఇది చట్టబద్ధ స్వతంత్ర సంస్థగా వ్యవహరిస్తుంది. ఈ సంస్థకు ఒక చైర్మన్, ముగ్గురు పూర్తికాల సభ్యులు, ముగ్గురు పార్ట్‌టైమ్ సభ్యులు ఉంటారు. వీరి పదవీకాలం 5సంవత్సరాలు. వీరిని కేంద్రప్రభుత్వం నియమిస్తుంది. వీరిపై ఆరోపణలు వచ్చినపుడు విచారించి చర్య తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది. ఈ సంస్థ కార్యస్థానం దేశ రాజధానిలో ఉంటుంది. ఇది స్వతంత్ర చట్టబద్ధసంస్థ అయినప్పటికీ ఈ సంస్థ సభ్యులను నియమించే, తొలగించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉండటంతో ఇది కేంద్ర పాలకుల కనుసన్నలలోనే నడిచే సంస్థగా మిగిలిపోయే అవకాశం ఉన్నది.

ఇప్పటివరకు నూతన పెన్షన్ పథకం (New Pension Scheme) గా పిలుస్తున్న పెన్షన్ విధానాన్ని ఇకముందు జాతీయ పెన్షన్ పథకం (National Pension Scheme) గా పేరుమార్పు చేశారు. పి.ఎఫ్.ఆర్.డి.ఎ. జాతీయ పెన్షన్ పథకాన్ని పర్యవేక్షిస్తుంది. జాతీయ పెన్షన్ పథకం అమలు చేసే సంస్థలను నియంత్రిస్తుంది. దానిఅభివృద్ధికి సూచనలు, సలహాలనిస్తుంది. ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరిస్తుంది. ఎన్.పి.ఎస్.లో చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు చేపడుతుంది. పెన్షన్‌నిధి నిర్వాహకుల (Pension Fund Managers) పనిని పర్యవేక్షిస్తుంది. వారు ఏయే విధంగా మదుపుచేస్తున్నారు. దానిలో లాభనష్టాలు ఎలాఉన్నాయో ఎప్పటి కప్పుడు సమాచారం తెప్పించుకొని సమీక్షిస్తుంది. 25 మంది సభ్యులతో కూడిన పెన్షన్ సలహాసంస్థ (Pension Advisory Committee) ని ఏర్పరుస్తుంది. ఈ కమిటీలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, పారిశ్రామిక వాణిజ్యవర్గాల ప్రతినిధులు, చందాదారులు, పెన్షన్‌ఫండ్ నిర్వాహకులు సభ్యులుగా ఉండవచ్చు.

ఈ బిల్లు ఆమోదంపొంది చట్టంగా ఇంకా మారలేదు కావున ఈ పది సంవత్సరాల నుండి ఉద్యోగుల నుండి వసూలు చేస్తున్న పెన్షన్ కంట్రి బ్యూషన్ మొత్తం, ఒక మధ్యంతర పెన్షన్‌నిధి నియంత్రణ మరియు ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నది. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఏర్పడే PFRDA కు ఈ మధ్యంతర సంస్థయొక్క ఆస్తులు, అప్పు సంక్రమిస్తాయి. ఇప్పటివరకుఉన్న నిధులన్నీ PFRDA ఆధ్వర్యంలోనికి వస్తాయి.

**జాతీయ పెన్షన్ పథకం అమలు చేసేవిధానం :**

1-1-2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలలో నియమితులైన కేంద్రప్రభుత్వ ఉద్యోగులందరు విధిగా ఈ పథకంలో చందాదారులుగా చేరాలి. వారి మూలవేతనం మరియు కరువుభత్యంలో 10శాతాన్ని చందాగా చెల్లించాలి. దానికి సమాన మొత్తంలో ప్రభుత్వం మ్యాచింగ్‌గ్రాంటును విడుదల చేస్తుంది. 1-5-2009నుండి ఈ పథకాన్ని దేశంలోని ప్రజలందరికీ వర్తింపచేశారు. అయితే ఈ పథకంలో ఉద్యోగులు కానివారు

www.apteachers.com

స్వచ్ఛందంగా చేరవచ్చు. ప్రభుత్వం ఎటువంటి మ్యాచింగ్ గ్రాంటు విడుదలచెయ్యదు. ఆ తరువాత కేంద్రప్రభుత్వం స్వాభిమాన్ పథకాన్ని ప్రకటించింది. ఇందులో చందాదారులుగా చేరినవాళ్ళు, ప్రతి సంవత్సరం కనీసం 1,000 రూపాయల నుంచి 12,000 రూపాయల వరకు చెల్లించాలి. ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుగా రు. 4,000 చెల్లిస్తుంది.

జాతీయ పథకాన్ని నిర్వహించుటకు ప్రభుత్వం 3 అంచెల వ్యవస్థను ఏర్పాటుచేసింది. మొదటిది కేంద్ర రికార్డు నిర్వహణ సంస్థ (Central Record Keeping Agency (CRA) పథకంలోని చందాదారులకు సంబంధించిన ఖాతాలన్నింటిని ఇది నిర్వహిస్తుంది. వీరు అడిగిన సమాచారాన్ని అందిస్తుంది. చందాదారులు ఒక పథకాన్నుంచి ఇంకో పథకానికి మారాలనుకుంటే ఆ ఏర్పాటు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం CRA గా National Security Depositary Limited (NSDL) ను నియమించింది. NSDL తన కార్యకలాపాలను నిర్వహించటానికి POP (Persons of Presence) ను నియమించుకోవచ్చు. మన రాష్ట్రంలో కార్వీ కన్సెల్టెన్సీని POP గా నియమించారు.

చందాదారులు చెల్లించిన నిధులను ప్రభుత్వ ఆధ్వర్యంలో కాకుండా ప్రైవేటు పెన్షన్ ఫండ్ మేనేజర్లకు వాటిని నిర్వహించే అవకాశం కల్పించారు. ఈ పెన్షన్ ఫండ్ మేనేజర్లు (PFM) గా ఎల్.ఐ.సి. పెన్షన్ ఫండ్ లిమిటెడ్, యు.టి.వి. రిటైర్‌మెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్, ఎస్.బి.ఐ. పెన్షన్‌ఫండ్ లిమిటెడ్, హెచ్.డి.ఎఫ్.సి., ఐ.సి.ఐ.సి.ఐ. ప్రుడెన్షియల్, రిలయన్స్ కాపిటల్, కోటక్ మహేంద్రలను నియమించింది. చందాదారులు ఈ ఏడు కంపెనీలలో దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు. వారు జమచేసిన మొత్తాలు ఆయా కంపెనీల ఖాతాలలోనికి వెళ్తాయి.

ప్రతి చందాదారుడు సెంట్రల్‌రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ (CRA)కి దరఖాస్తు చేసుకొంటే శాశ్వత పదవీవిరమణఖాతాసంఖ్య, Permanent Retirement. Account Number (PRAN) ను కేటాయిస్తారు.

చందాదారులకు సంబంధించి రెండురకాల ఖాతాలు ఉన్నాయి. రెండు దొంతర (Teirs) లుంటాయి. మొదటి దొంతర (TIER-I) లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉంటారు. వీరు తప్పని సరిగా TIER-I ఖాతాలోనే ఉంటారు. ఈ దొంతర లోని చందాదారునికి ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటు కూడా లభిస్తుంది. కాని పదవీవిరమణ చేసే వరకు దీనినుండి డబ్బును ఆహరణం (Withdraw) చేసే అవకాశం లేదు.

రెండవ దొంతర (Tier -II) ఖాతాలో అసంఘటితరంగానికి చెందిన ప్రజానీకం చేరవచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా TIER-I లో చెల్లించిన చందాకు అదనంగా TIER-II లో చెల్లించవచ్చు. కాని రెండవ దొంతర (TIER-II) ఖాతాలో ఎవరికీ ప్రభుత్వం

www.apteachers360.com

మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వదు. కాని ఇందులో నుంచి అవసరమైనప్పుడు కొంత మొత్తాలను ఆహరణం (Withdraw) చేసుకోవచ్చు.

**ఫండ్ మేనేజర్లు :** కనీసం 500 కోట్ల రూపాయలు వ్యాపార పరిమాణం కలిగివుండి గత మూడేళ్ళుగా వరుసగా లాభాలు గడించిన సంస్థలకే ఫండ్‌మేనేజర్లుగా నియమించాలి. ఆ ఫండ్ మేనేజర్లు తమకు వచ్చిన నిధులను క్రింది విధంగా మూడు పథకాలలో మదుపు చేయాలి.

1. **ఇ. తరగతి ఆస్తులు (షేర్ మార్కెట్)** – ఎన్.పి.ఎస్. చందాదారుని మదుపు మొత్తంలో 50 శాతానికి మించకుండా బి.ఎస్.ఇ. ఇండెక్స్ ఫండ్‌కాని, ఎన్.ఎస్.ఇ. నిఫ్టీ 50 ఇండెక్స్‌ఫండ్ పథకాలలో కాని మదుపు చేయాలి. ఎక్కడ మదుపుచేయాలనేది ఫండ్ మేనేజర్ నిర్ణయిస్తారు.
2. **జి. తరగతి ఆస్తులు (ప్రభుత్వ సెక్యూరిటీలు)** – చందాదారుని మదుపు మొత్తంలో కొంతభాగాన్ని కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలి.
3. **సి తరగతి ఆస్తులు :**– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాక ఇతర సంస్థలు జారీచేసే బాండ్లలో కొంత మొత్తాన్ని మదుపు చేయాలి. మ్యూచువల్ ఫండ్, ఋణ సెక్యూరిటీలు, పబ్లిక్‌రంగ సంస్థల మునిసి పాలిటీల, కార్పొరేషన్‌ల బాండ్లు మొదలైన వాటిలో మదుపు చేయాలి.

ఈ పథకంలో చేరేవారి వయసుకనుగుణంగా అతనికి తక్కువ రిస్కు ఉండే విధంగా పై మూడు రకాల పథకాలలోను పట్టిక–1లో చూపిన విధంగా ఫండ్ మేనేజర్లు మదుపు చేయాలి. ఈ మొత్తాలకు 5% అటూఇటుగా ఉండవచ్చు. ఫండ్ మేనేజర్లకు వాటాలున్న ఇతర సంస్థలలో మదుపు చేయటానికి ఈ నిధులను మళ్ళించరాదు.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడులకై వచ్చే ఆదాయం అంచనా కట్టలేము. రిస్కు ఎక్కువ కనుక వయసు పెరిగిన కొద్దీ అంటే పదవీ విరమణ దగ్గరపడే కొద్దీ రిస్కు తగ్గించే పద్ధతిలో ప్రభుత్వబాండ్లులో ఎక్కువగా పెట్టుబడిపెట్టే విధంగా రూపొందించారు.

**పెన్షన్ ఫండ్స్ పై లాభ నష్టాలు :**

ప్రభుత్వం ఎన్ని సూత్రీకరణలు చేసి విధివిధానాలు రూపొందించినా పెన్షన్ ఫండ్స్‌లో మదుపు చేసినవారికి తగిన ప్రతిఫలం వస్తుందన్న గ్యారంటీలేదు. అసలు ప్రతిఫలం ఉంటుందన్న గ్యారంటీ కూడా లేదు. భారతదేశంలో పెన్షన్ ఫండ్స్ ఆవిర్భవించిన నాటినుంచి (2008) పరిస్థితిని పరిశీలిస్తే మదుపుదార్లకువచ్చే ప్రతిఫలం అత్యల్పంగాఉంటుందని, డోలాయమానంగా ఉంటుందని అర్ధమవుతుంది. జాతీయ పెన్షన్ పథకంలో పెట్టిన పెట్టుబడులపై వచ్చిన ప్రతిఫలం 2008–11 కాలంలో కేంద్ర

www.apteachers.vizag.yolasite.com

**పట్టిక-1**

**వయస్సువారీగా చందాదారుని మదుపుకు కేటాయించాల్సిన విధానం**

| వయస్సు | ఎస్సెట్‌క్లాస్-ఇ | ఎస్సెట్‌క్లాస్-సి | ఎస్సెట్‌క్లాస్-జి |
|---|---|---|---|
| 35 సంవత్స రాల వరకు | 50% | 30% | 20% |
| 36 | 48% | 29% | 23 |
| 37 | 46% | 28% | 26 |
| 38 | 44% | 27% | 29 |
| 39 | 42% | 26% | 32 |
| 40 | 40% | 25 | 35 |
| 41 | 38% | 24 | 38 |
| 42 | 36% | 23 | 41 |
| 43 | 34% | 22 | 44 |
| 44 | 32% | 21 | 47 |
| 45 | 30% | 20 | 50 |
| 46 | 28% | 19 | 53 |
| 47 | 26% | 18 | 56 |
| 48 | 24% | 17 | 59 |
| 49 | 22% | 16 | 62 |
| 50 | 20% | 15 | 65 |
| 51 | 18% | 14 | 68 |
| 52 | 16% | 13 | 71 |
| 53 | 14% | 12 | 74 |
| 54 | 12% | 11 | 77 |
| 55 | 10% | 10 | 80 |

ప్రభుత్వ ఉద్యోగులకు 16.38% నుండి 8.05% వరకు ఉన్నది. అదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెట్టుబడులపై 2009-11 కాలంలో వచ్చిన ప్రతిఫలం 11.34% నుండి 5.94% వరకు మాత్రమే ఉన్నాయి. అసంఘటిత రంగ కార్మికులకు 2009-11 కాలానికి వచ్చిన ప్రతిఫలం 12.52% నుండి 1.82% వరకు ఉన్నాయి. అంటే ఆదాయాలలో చాలా వ్యత్యాసం చోటుచేసుకుంటున్నది. దీనితో సాధారణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు దాచుకున్న మొత్తాలపై ఎంత ఆదాయం వస్తుందో, చివరికి నికరంగా ఎంతమిగులుతుందో చెప్పలేని అనిశ్చితస్థితి ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ఒక మాదిరిగా ఉండి, స్థూల జాతీయోత్పత్తిలో వృద్ధిరేటు 5-6% ఉన్నపుడే ఇది అనిశ్చితంగా ఉంటే వృద్ధిరేటు పడిపోయి ఆర్థిక సంక్షోభం ఏర్పడితే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది.

**వివిధ పెన్షన్ ఫండ్‌ల ఆదాయ పరిస్థితి క్రింది విధంగా ఉంది.**

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు : లాభాలు**

| సంవత్సరం | SBI | UTI | LIC |
|---|---|---|---|
| 2008 - 09 | 16.38% | 13.01% | 12.18% |
| 2009 - 10 | 8.88% | 9.27% | 12.27% |
| 2010 - 11 | 8.05% | 8.45% | 8.30% |
| 2011 - 12 | 0.33% | 0.12% | 0.04% |

గమనిక : 2011-12 గణాంకాలు 1-4-2011 నుండి 30-6-2011 వరకు మాత్రమే.

**వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు : లాభాలు**

| సంవత్సరం | SBI | UTI | LIC |
|---|---|---|---|
| 2009 - 2010 | 6.34 | 5.94 | 6.03 |
| 2010 - 2011 | 9.88 | 11.24 | 10.77 |
| 2011 - 2012 | 0.62 | 0.33 | 0.11 |

గమనిక : 2011-12 గణాంకాలు 1-4-11 నుండి 30-6-2011 వరకు మాత్రమే

ప్రభుత్వ సంస్థల పరిస్థితి ఇలా ఉంటే ప్రైవేటు రంగం నిర్వహించే పెన్షన్ ఫండ్‌ల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేము.

ఈ పరిస్థితులలో విదేశీ గుత్త సంస్థల ఒత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం పెన్షన్ ఫండ్స్‌లలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడులకు అనుమతినిచ్చింది. పెన్షన్ ఫండ్‌లో విదేశీ పెట్టుబడులు

49% వరకు ఉంచవచ్చని పేర్కొన్నది. విదేశీ సంస్థలు పెట్టుబడి పెట్టవలసిన అవసరమేమున్నది. పెన్షన్ ఫండ్ నిర్వహణకు పెట్టుబడి అవసరం లేదు. పెన్షన్ ఫండ్ ద్వారా ఫండ్ మేనేజర్లకే పెట్టుబడి సమకూరుతుంది. దానితో వారు మదుపు పెట్టవచ్చు. కావున విదేశీసంస్థల ప్రవేశానికి అవకాశమేలేని, విదేశీ పెట్టుబడుల అవసరమేలేని ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆహ్వానించడం ద్వారా లక్షలకోట్ల రూపాయలను విదేశీ గుత్త సంస్థలకు పళ్ళెంలో పెట్టి అందించడమే.

ప్రపంచీకరణ అమలు ప్రారంభమైన తర్వాత అనేక దేశాలలో పెన్షన్ రంగంలో మార్పులు తీసుకువచ్చారు. అధిక దేశాలు Defined Benefit System నుండి Defined Contributary System కు మారాయి. కొన్నిదేశాలు రెండు వ్యవస్థలను అమలుచేస్తున్నాయి. పెన్షన్ ఫండ్‌ల ద్వారా నిధుల నిర్వహణ సాగిస్తున్న వివిధ దేశాలలో ఆ ఫండ్‌లకు వస్తున్న ఆదాయాలు కొన్ని ఉదాహరణలను పరిశీలిస్తే ఎంత నష్టదాయకంగా ఉన్నాయో, ఉద్యోగులు ఏవిధంగా నష్టపోతున్నారో అర్థమవుతుంది.

**2011లో వచ్చిన ప్రతిఫలం**

| | | | |
|---|---|---|---|
| ఉక్రెయిన్ | +5.6% | డెన్మార్క్ | +12.1% |
| కోస్టారికా | +4.1% | నెదర్లాండ్స్ | +8.2% |
| ఇండోనేషియా | +2.6% | ఆస్ట్రేలియా | +4.1% |
| నమీబియా | +0.1% | న్యూజిలాండ్ | +1.8% |
| రుమేనియా | -0.3% | కెనడా | +1.2% |
| థాయ్‌లాండ్ | -0.7% | స్పెయిన్ | -2.2% |
| పాకిస్తాన్ | -1.2% | ఇంగ్లండ్ | -2.5% |
| సెర్బియా | -1.3% | అమెరికా | -2.7% |
| ఇండియా | -2.6% | జపాన్ | -3.8% |
| కొలంబియా | -3.7% | గ్రీస్ | -5.6% |
| నైజీరియా | -6.3% | పోలెండ్ | -9.1% |
| లాట్వియ | -8.1% | కెన్యా | -24.2% |

ఈ గణాంకాలు పరిశీలిస్తే వివిధ దేశాలలో పెన్షన్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టిన ఉద్యోగులు, కార్మికులు నష్టపోయారని, వారు పొదుపు చేసుకొన్న మొత్తాలు తిరిగిరావని అర్థమవుతోంది. వాటి ఫలితమే గ్రీసులో, స్పెయిన్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. పెన్షన్స్ లలో కోత పడింది. మన దేశంలో ఉద్యోగుల జీతం నుండి10% పెన్షన్ నిధికి జమచేస్తే ప్రభుత్వాలు 10% మ్యాచింగ్ గ్రాంటుగా ఇస్తున్నాయి. ఇది ఎల్లకాలం జరుగుతుందని భావించలేము. ఉదాహరణకు జకోస్లొవేకియా 9% నుండి 4%కు, లాట్వియా 8% నుండి 2%కు, లిథుయేనియా 5.5% నుండి 2%కు, పోలెండ్ 7.3% నుండి 2.3%కు మ్యాచింగ్ గ్రాంట్లను తగ్గించాయి. భారత ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంటు కొనసాగిస్తుందన్న హామీలేదు. పదవీవిరమణ అనంతరం భద్రతతో కూడిన ప్రశాంత జీవితం కొంత మేరకైనా అనుభవిస్తున్న మధ్యతరగతి ఉద్యోగ వర్గాలకు ఆమేరకు భద్రత కూడాలేకుండా చూస్తూ ఈ.పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లును భారత పాలకులు ముందుకు తీసుకువచ్చారు. ముందుకు తీసుకురావటమేకాదు బిల్లు ఆమోదానికి పదేళ్ళ ముందు నుంచే అమలు చేస్తున్న పాలకులు ఎంత గుండెలు తీసినబంట్లో అర్థమవుతోంది. వీరు ఉద్యోగుల ప్రజల

ప్రయోజనాలను రక్షిస్తారని ఆశిచంటం తప్పు.

**పార్లమెంటరీస్థాయి సంఘం సిఫారసులు – ప్రభుత్వ వైఖరి:**

పి.ఎఫ్.ఆర్.డి.ఎ. బిల్లు 2011పై యశ్వంతసిన్హా అధ్యక్షతన ఏర్పడిన పార్లమెంటరీ స్థాయిసంఘం చేసిన సిఫారసులను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ స్థాయిసంఘంలో అధికార కాంగ్రెస్ సభ్యులు కూడా ఉన్నారు. అయినా ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ గుత్తపెట్టుబడి సేవలో తరించే మన పాలకులకు పార్లమెంటరీ స్థాయిసంఘమొక లెక్కలోనిదికాదు. TIER-I ఖాతాదారులకు అంటే ప్రభుత్వ ఉద్యోగులకు అత్యవసర సమయాలలో పెన్షన్ ఫండ్నుండి కొంత డబ్బు విత్డ్రా చేసుకొనే అవకాశం కల్పించాలని చేసిన సిఫారసును పట్టించుకోలేదు. డబ్బు డ్రాచేసుకొనే అవకాశం ఇస్తే ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల భవిష్యనిధిలాగా పదవీవిరమణ చేసేనాటికి మొత్తం డ్రా చేస్తారని, పథకం ఆశయం నెరవేరదని ప్రభుత్వం సమాధానమిచ్చింది.

పెన్షన్ ఫండ్స్లో విదేశీ పెట్టుబడులు 26 శాతానికి మించరాదని, చందాదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగితే వారిని ఆదుకోవటం కష్టసాధ్యమవుతుందని స్థాయీ సంఘం సిఫారసు చేసింది. దానిని కూడా పట్టించుకోకుండా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు 49% అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది.

ఎన్.పి.ఎస్. సభ్యుల నుండి సి.ఆర్.ఎ. వసూలు చేసే నిర్వహణ రుసుము 0.5 శాతానికి మించకూడదని, సాధ్యమైనంత కనిష్ఠ రుసుము వసూలు చేసేవిధంగా ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. PFRDA లో ఉద్యోగ సంఘాలు మరియు చందాదారుల ప్రతినిధులను సభ్యులుగా నియమించాలని స్థాయిసంఘం సిఫారసు చేసింది. పెన్షన్ అడ్వయిజరీ కమిటీలో మాత్రమే నియమిస్తామని ప్రభుత్వం చెబుతుంది.

పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసులను కూడా ప్రక్కన బెట్టి, ఉద్యోగుల, కార్మికుల ప్రయోజనాలను హరించడానికే కేంద్రప్రభుత్వం నిర్ణయించుకొన్నది.

**కొత్త జాతీయ పెన్షన్ పథకం ఎవరికోసం?**

ప్రపంచవ్యాప్తంగా వృద్ధులు పెన్షన్ సౌకర్యంలేక బాధపడుతున్నారని, ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలోను, వెనుకబడిన దేశాలలోను 10% కంటె తక్కువ మందికే పదవీ విరమణ అనంతరం లేదా వృద్ధాప్యంలోను జీవన భద్రత లభిస్తున్నదనీ మిగిలినవారికి ఎటువంటి సామాజిక భద్రత లేదనీ, దీనికి మార్గాలను అన్వేషించాలని ప్రపంచబ్యాంకు అభిప్రాయపడింది. అందులో భాగంగా 1994లో Averting the Old Age Crisis అను పత్రాన్ని ప్రచురించింది. అప్పటివరకు వివిధ

www.apfvizag.wordpress.com

ప్రపంచదేశాలలో ఉద్యోగులకు పెన్షన్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఉద్యోగులకు మాత్రమే ఈ భద్రత ఇస్తేసరిపోదు, అందరకూ ఇవ్వాలంటూ దానికి ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు తాము సంపాదిస్తున్న కాలంలోనే కొంత మొత్తాన్ని పెన్షన్ నిధులలో జమచేసి, పదవీవిరమణ తరువాత దాని నుండి వచ్చే ఆదాయంతో సుఖంగా జీవించవచ్చునని ప్రతిపాదించింది. అప్పటి నుండి పెన్షన్ రంగంలో సంస్కరణల కొరకు ప్రపంచదేశాలపై ఒత్తిడి తేవడం ప్రారంభించింది. ఆ ఒత్తిడి ఫలితంగా అనేక దేశాలు Defined Benifit System నుండి Defined Contribution System కు మారాయి. ఆక్రమంలోనే భారతదేశంలో కూడా Old Age Social and Income Security (OASIS) కమిటీని ఎస్.ఎ. దావె ఆధ్వర్యాన 2000లో నియమించారు. దాని సిఫారసు ఆధారంగా ఈ కొత్త పెన్షన్ పథకాన్ని రూపొందించారు.

ఈ పెన్షన్ సంస్కరణలను ప్రపంచ వ్యాప్తంగా అమలు చేయించ డంలో మరొక ముఖ్యమైన పార్శ్వం కూడావుంది. ప్రపంచ పెట్టుబడిదారీ వర్గానికి అనాయాసంగా పెట్టుబడి లభిస్తుంది. కార్మికుల శ్రమను కొల్లగొట్టడం ద్వారా పెట్టుబడి పోగుచేసుకొని ఆ పెట్టుబడితో మరింత కార్మికుల శ్రమను కొల్లగొట్టి పెట్టుబడిని వృద్ధిచేసుకొంటున్న పెట్టుబడిదారీ వర్గాలు, ప్రపంచ ఆర్థికమాంద్యంలో కూరుకుపోయిన తర్వాత ఆ సంక్షోభం నుండి బయటపడటానికి అనేక క్రొత్తమార్గాలు అన్వేషించాయి. క్రొత్త పెట్టు బడులకోసం ప్రయత్నించాయి. అందులో భాగంగానే ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు దాచుకుంటున్న మొత్తాలపై కన్నేశాయి. వృద్ధాప్య జీవితంలో భద్రతపేరుతో నూతన పెన్షన్ పథకానికి రూపకల్పన చేశారు.

అమెరికాలో పెన్షన్ ఫండ్‌ల విలువ 29.5 ట్రిలియన్ డాలర్లు. ఈ మొత్తంలో 68.4% నిధులు ప్రైవేటు పెన్షన్ ఫండ్‌లలో ఉన్నాయి. ఇది కాక బ్యాంకులు ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రకటించే రిటైర్‌మెంట్ స్కీములో మరిన్ని ట్రిలియన్ డాలర్లున్నాయి. గత 10 సంవత్సరాలలో పెన్షన్‌ఫండ్‌లలో నిధులు 10 రెట్లు పెరిగాయి. అభివృద్ధి చెందుతున్న పేద దేశాలలోను 2004 తర్వాత ఎక్కువ పెన్షన్ ఫండ్‌లను నెలకొల్పి నిధులను పోగుచేస్తున్నారు. ఈ నిధులన్నీ ప్రైవేటు పెట్టుబడిగా మారుతున్నాయి. భారతదేశంలో పెన్షన్ ఫండ్‌లు ప్రారంభించిన ఈ 5 సంవత్సరాలలోనే రు.3 వేల కోట్లకు పైగా నిధులు పోగయ్యాయి. ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ (ఇ.పి.ఎఫ్) మరియు ఇ.పి.ఎస్. వంటి పథకాలలో ఉన్న డబ్బుకూడా కలిపితే దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలు అవుతుంది. పలుదేశాలలో పెన్షన్ ఫండ్ ఆ దేశాలలో పెట్టుబడికి ప్రధానవనరుగా ఉన్నాయి. కొన్నిదేశాల ఆర్థిక వ్యవస్థల పరిణామంతో పోటీపడేవిధంగా పెన్షన్‌ఫండ్స్ ఉన్నాయి. ఉదాహరణకు ఆయాదేశాల స్థూలజాతీయోత్పత్తితో పోలిస్తే పెన్షన్‌ఫండ్స్ కొలంబియాలో 17%, పెరూలో 16.9%, బ్రెజిల్‌లో 13.8%, రష్యాలో



www.apvizag.weebly.com

3.2%, ఫిన్‌లాండ్‌లో 10%, సిట్జర్లాండ్‌లో 9%, ఆస్ట్రేలియా 7% ఉన్నాయి. (2011లో). పెన్షన్ ఫండ్‌లో పెట్టుబడులు 2%నుండి 5%వృద్ధిరేటును కనబరుస్తున్నాయి.

పై వివరాలు పరిశీలిస్తే ఉద్యోగులు, కార్మికులు పెన్షన్ కొరకు దాచుకునే డబ్బు పెట్టుబడిదారులకు పెట్టుబడిగా అనాయాసంగా లభిస్తున్నదని తెలుస్తుంది. ప్రజల డబ్బులతోనే వ్యాపారం చేసి లక్షల కోట్ల రూపాయలు లాభాలు గడిస్తున్నారు. ఈ ప్రయోజనాల కొరకే పెన్షన్ ఫండ్స్‌ను ప్రైవేటురంగంలో ఏర్పరుస్తున్నారు. ఉద్యోగులకున్న భద్రతను గాలికొదిలి రిస్కుతోకూడిన పథకాలకు మళ్ళిస్తున్నారు. రిస్కు ప్రజలదీ! లాభాలు ఫండ్ మేనేజర్లకు!! ప్రపంచ వ్యాప్తంగా మదుపు చేసిన మొత్తంలో సగటున 2% వరకు ఫండ్ మేనేజర్లకు నిర్వహణ ఖర్చులకింద ఇస్తున్నారు. అంటే మదుపు చేసిన డబ్బుపై వచ్చిన ఆదాయంలో 20% నుండి 50% వరకు వాళ్ళే తీసుకొంటున్నారన్నమాట. ప్రభుత్వ బాండ్లు, మునిసిపల్ కార్పొరేషన్, ప్రభుత్వరంగ సంస్థల బాండ్లు కొంటే మదుపుచేసిన ధనం సురక్షితంగా ఉంటుందని ఈక్విటీ పథకాలలో పెట్టుబడి పెడితే రిస్క్ ఎక్కువనీ నమ్మబలుకుతున్నారు. కానీ ప్రభుత్వాలు పబ్లిక్‌రంగ సంస్థలు, నగర కార్పొరేషన్‌లు దివాళాతీస్తున్న ఈ రోజులలో ప్రజాధనాన్ని ఎవరో పెట్టుబడిగా తమ ఇష్టంవచ్చిన చోట పెట్టుబడి పెట్టటం తీవ్రనష్టానికి దారితీస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని డెట్రాయిట్ నగరం వేలకోట్ల డాలర్ల ఋణాలు చెల్లించలేక దివాళా ప్రకటించింది. డెట్రాయిట్ మున్సిపల్ కార్పొరేషన్ జారీచేసిన బాండ్లు, సెక్యూరిటీలపై పెన్షనర్లకు ప్రస్తుతం ఏమీరావటంలేదు. దివాళా పరిష్కారమయితే వారు మదుపు చేసిన మొత్తాలలో 10% మాత్రమే తిరిగి చెల్లించగలమని డెట్రాయిట్ నగర మేయర్ ప్రకటించారు. లక్షల సంఖ్యలో ఉన్న ఆ నగరంలోని పెన్షనర్లు హతాశులయ్యారు. దిక్కుతోచక ఆందోళనమార్గం పట్టారు. దివాళాతీసిన అనేక కంపెనీలకు బెయిల్ అవుట్ ప్యాకేజీలు ప్రకటించిన అమెరికా ప్రభుత్వం వారికి మాత్రం ఎటువంటి హామీని ఇవ్వటంలేదు.

ఈ జాతీయ పెన్షన్‌పథకం మన వేలితో మన కన్ను పొడిచే విధంగా ఉంది. పెట్టుబడిదారులకు రెండు రకాల ప్రయోజనాలను కల్పిస్తున్న ఈ పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు భుజం భుజం కలిపి పోరాడాలి. పాలకులు అనుసరిస్తున్న ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు ఉపాధ్యాయులు క్రియాశీల మద్దతునివ్వాలి. ఈ విధానాల ఓటమితోనే ప్రజలకు నిజమైన భద్రత చేకూరుతుందని అర్థం చేసుకొని అందుకొరకై నడుంబిగించాలి.

**(పై వ్యాసం PFRDA బిల్లు చట్టం కాకముందు ఆగస్టు 2013లో వ్రాయబడింది. సెప్టెంబర్ 2013 లో చట్టం చేయబడింది.)**

www.apkvizag.yolasite.com